సాక్షి
వరంగల్
శనివారం । 11 । మార్చి । 2023





**కల్పవల్లి ఫాతిమా మాత**

వరంగల్ మహా నగరంలో కాజీపేట ఫాతిమా మాత దేవాలయం(కేథడ్రల్) భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. - 8లో▸



**14 నుంచి పీజీ ఫస్ట్ సెమ్**

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నారు. - 8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం $36^0/20^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండగా ఉంటుంది. వాతావరణం పొడిగా, వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### మిర్చి పరిశోధన కేంద్రానికి స్థల పరిశీలన



నల్లబెల్లి: కన్నారావుపేట శివారులో మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటు కోసం నర్సంపేట ఇన్‌చార్జ్ ఆర్డీఓ మహేందర్ జీ శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఇదే గ్రామ శివారు సర్వే నం .58 ప్రభుత్వ స్థలంలో ఉద్యానవన శాఖ వనరుల కేంద్రం నిర్మాణానికి స్థల అనుకూలతను పరిశీలించారు. సంబంధించిన భూ రికార్డులను తనిఖీ చేసి రికార్డులో ఉన్న ప్రకారంగా హద్దులను సరిచూశారు. స్థలం మిర్చి పరిశోధన కేంద్రానికి అనుకూలంగా ఉందని వెల్లడించారు.

### జిల్లాకు 1,100 దళితబంధు యూనిట్లు

వరంగల్ రూరల్: జిల్లాకు రెండో విడత మరో 1,100 దళితబంధు యూనిట్లు మంజూరు కానున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం డిప్యూటీ డైరెక్టర్ డి.సురేశ్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడత జిల్లాకు 308 దళితబంధు యూనిట్లు మంజూరయ్యాయని, మొత్తం గ్రౌండింగ్ కూడా పూర్తయిందన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు బుక్ కీపింగ్‌పై అవగాహన కోసం ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రెండో విడత దళితబంధు పథకానికి ఇంకా విధివిధానాలు రావాల్సిందని ఆయన చెప్పారు.

### రేపు రెండు జిల్లాలస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 12న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వరంగల్, హనుమకొండ జిల్లాలస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14 బాలబాలికల విభాగంలో 100, 200, 400, 800, 1500, 3000, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో ఈవెంట్లలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్, గోల్కొండలోని ఆర్టిల్లరీ సెంటర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను వెంట తీసుకుని జేఎన్ఎస్‌లో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

### 21న రెండో విడత కౌన్సెలింగ్

ఎంజీఎం: ఈ విద్యాసంవత్సరం 2022–2023 వివిధ పారా మెడికల్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న 114 సీట్లకు ఈనెల 21న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎంసీలోని ఆడిటోరియంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాప్‌అప్ రౌండ్ ఉంటుందని తెలిపారు. గతంలో వివిధ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. పూర్తి మెరిట్ ప్రాతిపదికన జరిగే ఈ ప్రక్రియకు విద్యార్థులు పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లు లేని వారు అనర్హులని వివరించారు.

### మహిళలు శాస్త్రవేత్తలుగా రాణించాలి



కాజీపేట అర్బన్: మహిళలు శాస్త్రవేత్తలుగా రాణించాలని సీఎస్ఐఆర్–ఎన్‌జీఆర్ఐ రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ కీర్తి శ్రీవాస్తవ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళా రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థినులకు వారంరోజుల స్తుతి(సీనర్జిస్టిక్ ట్రైనింగ్ ప్రోగ్రాం, యుటిలైజింగ్ ద సైంటిఫిక్ అండ్ టెక్నోజికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) పేరిట సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ, నిట్ వరంగల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సును కీర్తి శ్రీవాస్తవ ప్రారంభించి మాట్లాడారు. భారత ప్రభుత్వం అవకాశం కల్పించే ఉమెన్ సైంటిస్ట్, ఇండో యూఎస్ ఫెలోషిప్ ప్రోగ్రాంలకు ఎంపికయ్యేందుకు వేదికగా స్తుతీ సదస్సు నిలవాలని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎన్వీ.ఉమామహేష్, ప్రొఫెసర్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# లైనింగ్ లేక.. నీరు పారక..!

**పస్నూరు, జాలుబంధం కాల్వల కింద నీరందని పరిస్థితి**

- చివరి ఆయకట్టులో ఎండుతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న వరి సాగు రైతులు



కాల్వలో గుర్రపు డెక్క నాచు

నర్సంపేట రూరల్: పాకాల సరస్సు నుంచి పంటలకు నీరందించడానికి కాల్వలున్నా.. చివరి ఆయకట్టుకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఉన్న కాల్వలకు లైనింగ్ లేకపోవడం వల్ల పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క, కలుపు ఏపుగా పెరిగి నీటి పారకానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రబీ పంటలకు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. నర్సంపేట డివిజన్‌లోని పాకాల సరస్సు కింద ఏటా సుమారు 35వేల నుంచి 45వేల ఎకరాల వరకు సాగవుతోంది. అనధికారికంగా మరికొంత సాగవుతోంది. అయితే పాకాల సరస్సు నుంచి వచ్చే పస్నూరు, జాలుబంధం రెండు కాల్వల ద్వారా నర్సంపేట పరిధిలోని పంట భూములకు నీరందుతుంది. రెండు కాల్వల కింద సుమారు 5వేల నుంచి 7వేల ఎకరాల వరకు పంటలు సాగవుతున్నాయి. ఆయా కాల్వలకు లైనింగ్ లేకపోవడంతో ఏపుగా చెట్లు, గడ్డితోపాటు గుర్రపు డెక్క నాచు పెరిగి నీరు దిగువకు వెళ్లలేని పరిస్థితి. దీంతో చివరి అయకట్టు రైతులు రాత్రింబవళ్లు కష్టపడినా.. పంటలకు పూర్తిగా నీరు పారించలేకపోతున్నారు. ఎండిపోతున్న పంటలను చూసి రైతులు దిగులు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని ఆయకట్టు రైతులు కలిసి కాల్వల పరిస్థితి వివరించారు. దీంతో ఆయన సొంత డబ్బు ఇవ్వడంతోపాటు జేసీబీతో కాల్వలు శుభ్రం చేయించడంతో పంటలకు నీరందింది. ప్రస్తుత రబీ సీజన్‌లో పంటలకు నీరందించడానికి స్వచ్ఛందంగా ఎకరా భూమి ఉన్న రైతులు రూ.వెయ్యి చొప్పున జమ చేసి కాల్వలను శుభ్రం చేయించుకుంటున్నారు. ఏటా ఇదే సమస్య ఉత్పన్నమవుతుండటంతో శాశ్వత ప్రాతిపదికన కాల్వలకు లైనింగ్ పనులు చేపట్టి.. పంటలకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**నీటికోసం పోరాటం..**



ప్రతీ సంవత్సరం నీటి కోసం పోరాటాలు చేయాల్సి వస్తోంది. కాల్వలకు లైనింగ్ లేకపోవడంతో ఏపుగా పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పెరిగింది. పంటలకు నీరందడం కష్టంగా మారింది. చెత్త, నాచు తొలగించేందుకు చందాలు వేసుకొని శుభ్రం చేసుకోవాల్సి వస్తోంది.

– బొట్ల రాజు, రైతు, సర్వాపురం



జాలుబంధం కాల్వలో ఏపుగా పెరిగిన గడ్డి

# ఏజీపీ లేకనే...

- వరంగల్ కోర్టులో పెరుగుతున్న పెండింగ్ కేసులు
- కోర్టు నుంచి డిక్రీ ఇచ్చే లీగల్ హేర్ సర్టిఫికెట్లు కూడా..
- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏజీపీని నియమించాలి
- కలెక్టర్ దృష్టి సారించాలంటున్న ఆయా ప్రభుత్వ విభాగాలు



సాక్షి, వరంగల్: వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్ కేసులు పేరుకుపోతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ ఆస్తుల సివిల్, నీటిపారుదల, దేవాదాయ శాఖ కేసులు.. ఇలా అనేక రకాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టుల విభజన జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)ను వరంగల్ జిల్లాలో నియమించకపోవడంతో మూలుగుతున్న కేసుల సంఖ్య ఎక్కువవుతోంది. అదే హనుమకొండ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వ సివిల్ కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతుంటే.. వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వాదించేందుకు ఏజీపీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2022 సెప్టెంబర్‌లో వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులుగా విభజన చెందాయి. అయితే ఆనాటి నుంచి ఈ కేసుల గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. గతంలో ఉమ్మడి కోర్టు ఉన్నప్పుడు ఒక్క ఏజీపీయే ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాదనలు వినిపించడంతో ఎక్కడా ఇబ్బందులు తలెత్తలేదు.

**అన్నీ ఇబ్బందులే...**

సివిల్ కేసులతోపాటు ముఖ్యంగా ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో మరణిస్తే అతడి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఆ ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటుంది. దీనికోసం ఆ కుటుంబం తహసీల్దార్ నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకుంటుంది. ముఖ్యంగా వీరికి లీగల్ హెర్‌షిప్ అవసరమవుతుంది. ఈ సమయంలో ఏజీపీ వీరి తరపున లీగల్ హేర్ సర్టిఫికెట్ ఇప్పించే బాధ్యతను తీసుకుంటారు. ముందుగా వారి నుంచి లిఖితపూర్వక వాంగ్మూలం తీసుకొని ఏజీపీ వాదనలు వినిపించి లీగల్ హేర్ డిక్రీని కోర్టు నుంచి బాధిత కుటుంబానికి ఇప్పిస్తారు. వీరు దీనిని తీసుకొని ప్రభుత్వానికి సమర్పిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ వస్తుంది. ఇలాంటి ప్రాధాన్యత ఉన్న కేసులతోపాటు జిల్లాలోని ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన చాలా వరకు కేసులు ఏజీపీ లేకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయని ఆయా వర్గాలు అంటున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ గోపి దృష్టి సారించి ఏజీపీని నియమించాలని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

**ఫ్లూపై అప్రమత్తత అవసరం**

**చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి**
హనుమకొండ జిల్లా జడ్జి కృష్ణమూర్తి

**సావిత్రిబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి**

**ముగిసిన దర్గా ఉర్సు ఉత్సవాలు** - 10లో▸

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట: అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉప్పరపల్లి గ్రామంలో రూ.3కోట్లతో చేపట్టిన బీటీ, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని గ్రామాలు, తండాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు పోతున్నారని అన్నారు. తన నియోజకవర్గంలోని ఉప్పరపల్లి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. మన ఊరు–మన బడి కింద రూ.1.05కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. రూ.1.95కోట్ల అంచనా వ్యయంతో నెక్కొండ–సీతారాంపురం నుంచి ఉప్పరపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. రూ.1.20కోట్లతో గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు బాదావత్ విజేందర్, రమేశ్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, ఎంపీటీసీలు చెరుకుపల్లి విజేందర్‌రెడ్డి, గుండాల మహేందర్, సర్పంచ్ కుండె మల్లయ్య, సొసైటీ చైర్మన్ మురహరి రవి, వైస్ చైర్మన్ చింతకింది వంశీ, బీఆర్ఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ.గఫార్, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, మంతుర్తి అన్వేష్, కాసం కొంరయ్య, మల్లయ్య, బాలు పాల్గొన్నారు.

## ‘గో సంరక్షణ అందరి బాధ్యత’



లేగదూడలను పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

రాయపర్తి: గో సంరక్షణ అందరి బాధ్యత అని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పేర్కొన్నారు. బాలాజీతండాలో పది మంది రైతులకు 20 లేగదూడలను శుక్రవారం పంపిణీ చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ దేశానికి రైతన్న వెన్నెముక అని, అలాంటి రైతులను వ్యవసాయ రంగంలో ఆదుకోవడం గొప్ప వరమన్నారు. గోవుల మూత్రం, పేడతో సేంద్రియ వ్యవసాయాన్ని తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఆయన కోరారు. కావాల్సిన రైతులకు ఉచితంగా లేగదూడలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, ఆఫీస్ సూపరింటెండెంట్ దుర్గం రోజా, సర్పంచ్ కౌసల్య హనుమనాయక్, గోశాల ప్రతినిధులు మాంజ్యా, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే మోడల్‌గా నిలవాలి

- 75 ఏళ్ల బ్యాచ్‌లు ఒకే వేదికపై కలవడం అభినందనీయం
- నా చదువంతా సర్కారు విద్యాసంస్థల్లోనే.. : కలెక్టర్ గోపి
- అట్టహాసంగా ప్రారంభమైన ధర్మారం పాఠశాల వజ్రోత్సవ వేడుకలు



ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గోపి, డీఈఓ వాసంతి

గీసుకొండ: ‘ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 75 ఏళ్ల నాటి నుంచి ఉన్న ఎన్నో పూర్వ విద్యార్థుల బ్యాచ్‌లు ఒక్కచోట కలిసి వజ్రోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం. ఇక్కడి వేదికను చూస్తుంటే పెళ్లి మండపాన్ని తలపిస్తోంది. పాఠశాలకు మన బస్తీ–మన బడి కింద రూ.60లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. మిగతా పనులు ఏమైనా ఉంటే పాఠశాల అలూమ్నీ అసోసియేషన్ వారు ముందుకొచ్చి పూర్తి చేస్తే రాష్ట్రంలోనే మోడల్‌గా నిలిచే అవకాశం ఉంది’ అని కలెక్టర్ బి.గోపి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో వజ్రోత్సవాలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఒకటో తరగతి నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యాలయాల్లో చదివానన్నారు. వీటిలో అర్హత, అనుభవం ఉన్న బోధకులు ఉంటారని, తెలివితేటల్లో విద్యార్థులు ఎవరికీ తీసిపోరన్నారు. డీఈఓ డి.వాసంతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. తొలుత పాఠశాల సావనీర్‌ను కలెక్టర్ గోపి ఆవిష్కరించారు. అలూమ్నీ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె దయాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్ఎం సుజాత, తహసీల్దార్ విశ్వనారాయణ, పీఆర్ ఈఈ శంకరయ్య, కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్, రిటైర్డ్ హెచ్ఎం నర్సింహారెడ్డి, సుధాకర్, అసోసియేషన్ సభ్యులు కొట్టె ముత్తిలింగం, జీకే రాంబాబు, కొమ్ముల బాబు, డాక్టర్ వేణు, పర్ష మోహన్, రామా వెంకట్‌నారాయణ, పి.ప్రభాకర్, రామా సంతోష్ పాల్గొన్నారు. బ్యాచ్‌ల వారీగా గురువులను సన్మానించారు. పాఠశాల పూర్వ విద్యార్థి, బీఆర్ఎస్ నాయకుడు గోపాల నవీన్‌రాజు హాజరైన అందరికీ సొంత ఖర్చుతో భోజనాలు ఏర్పాటు చేసి.. రిటైర్డ్ హెచ్ఎం నర్సింహారెడ్డిని గజమాలతో సన్మానించారు.

**ఆనాటి గురువులకు పాదాభివందనం**

కాగా.. పలువురు పూర్వ విద్యార్థులు ఆనాటి తమ గురువులను కలిసి ఆప్యాయంగా పలకరించడంతోపాటు వారికి పాదాభివందనం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# యువ శాస్త్రవేత్తలుగా ఆవిష్కరణలు చేపట్టాలి

- వరంగల్ డీఈఓ వాసంతి



విజేతలకు ప్రశంసపత్రాలతోపాటు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న డీఈఓ వాసంతి

కాజీపేట అర్బన్: విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని యువ శాస్త్రవేత్తలుగా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని వరంగల్ డీఈఓ వాసంతి కోరారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో వరంగల్ జిల్లా విద్యాశాఖ, రీజినల్ సైన్స్ సెంటర్ సంయుక్తంగా జాతీయ సైన్స్ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సైన్స్‌టాలెంట్ హంట్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈఓ వాసంతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సైన్స్ టాలెంట్ హంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ జిల్లావ్యాప్తంగా 1,300 మంది విద్యార్థులు పాల్గొనగా.. ఊకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన డి.సిరి ప్రథమ స్థానం, జీహెచ్ఎస్ నరేంద్రనగర్ విద్యార్థి సీహెచ్.కార్తీక్ ద్వితీయ, కాశిబుగ్గలోని స్టాండర్డ్ హైస్కూల్‌కు చెందిన మణిసాయిమురళి తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. వారికి ప్రశంసపత్రాలతోపాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, రీజినల్ సైన్స్ సెంటర్ అధికారులు ఈర్ల రాకేష్, వెంకటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్స్ శ్యాం సుందర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, అశోక్, రాజయ్య, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆత్మవిశ్వాసంతో చదవాలి’



మాట్లాడుతున్న విద్యాశాఖ జిల్లా పరిశీలన బృందం అధికారి సుభాష్

సంగెం: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం తప్పక వరిస్తుందని విద్యాశాఖ జిల్లా పరిశీలన బృందం అధికారి కె.సుభాష్ అన్నారు. శుక్రవారం మొండ్రాయి ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమయం వృథా చేయకుండా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ.. సబ్జెక్టుల్లో అర్థంకాని విషయాలు ఉండే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ప్రత్యేక తరగతుల్లో సాయంత్రం వేళ అందించే అల్పాహారం అందుతుందా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బృందం సభ్యులు కొమురయ్య, ఆనంద్ మోహన్, కుమారస్వామి, ప్రసాద్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణ తదితరులు ఉన్నారు.

# ఆ భూమి అప్పగించండి..

- చేనేత, జౌళి శాఖకు జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- వరంగల్ కలెక్టరేట్‌కు 20.32 ఎకరాలు కేటాయింపు



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

వరంగల్: వివిధ సర్వే నంబర్లలోని 20 ఎకరాల 32 గుంటల ఆజంజాహి మిల్లు భూమిని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) నిర్మాణానికి అప్పగించేందుకు ప్రభుత్వం జీఓ నం .38ని గురువారం జారీ చేసింది. గతంలో వరంగల్ మండలం లక్ష్మీపురంలోని సర్వే నంబర్లు 68, 69, 70, 71, ఖిలా వరంగల్ మండలంలోని 369, 378, 379లో మొత్తం 6.16 ఎకరాలను సమీకృత కలెక్టరేట్ సముదాయంతోపాటు లక్ష్మీపురంలోని 64, ఖిలా వరంగల్‌లోని 381 సర్వే నంబర్లలోని 2.32 ఎకరాల్లో చేనేత, జౌళి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ 2021, డిసెంబర్ 6న జీఓ జారీ చేసింది. అయితే ఇళ్ల స్థలాల విషయంలో మిల్లు కార్మికులు(స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన) 318 మంది సుప్రీంకోర్టులో కేసు వేసినందున కలెక్టరేట్ నిర్మాణం పెండింగ్‌లో పడింది. ఈ స్థలంలో కలెక్టరేట్ నిర్మిస్తున్నందున ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) మడిపల్లి, అనంతసాగర్‌లోని లే అవుట్ ప్లాట్లు ఇస్తామని జిల్లా అధికార యంత్రాంగం కోర్టుకు విన్నవించింది. దీంతో సకల సౌకర్యాలతో అభివృద్ధి చేసి ఇవ్వాలని ఫిబ్రవరి 24న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. తాజాగా సుప్రీం ఇచ్చిన తీర్పుతో ఆజంజాహి మిల్లులోని 29 ఎకరాల స్థలం క్లియర్ అయింది. దీంతో గతంలో 29 ఎకరాల్లోనే చేనేత, జౌళి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసుకు కేటాయించిన 2.32 ఎకరాలు పోను.. కలెక్టరేట్ నిర్మాణానికి కేటాయించిన 6.16 ఎకరాలతోపాటు మిగిలిన స్థలాన్ని కలుపుకుని మొత్తం 26.68 ఎకరాలు ఇవ్వాలని, ఇందులో సమీకృత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయం, కలెక్టర్, అదనపు కలెక్టర్ల నివాసాలతోపాటు అన్నీ అక్కడే ఉండేలా ప్రణాళిక రూపొందించి నిర్మాణం చేపడతామంటూ కలెక్టర్ గోపి ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. సాధ్యమైనంత తొందరగా స్థలాన్ని రెవెన్యూ విభాగానికి బదిలీ చేయాలని కోరారు. మూడు రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ దృష్టికి జిల్లా నేతలు తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. చేనేత, జౌళి శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడడంతో వెంటనే జీఓ విడుదలైనట్లు సమాచారం. మిల్లు కార్మికులకు లే అవుట్ ప్లాట్లు కేటాయించడం, కలెక్టరేట్ నిర్మాణానికి లక్ష్మీపురంలోని సర్వే నం.62, 63, 65, 66, 67, 68, 71, 76, ఖిలావరంగల్ మండల పరిధిలోని సర్వే నం .368, 370, 371, 372, 373, 374, 375, 376, 377లోని మినీ టెక్స్‌టైల్స్ పార్కు పేర ఉన్న భూమి మొత్తం 20.32 ఎకరాలను సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయం కోసం కలెక్టర్‌కు అప్పగించాలని ప్రభుత్వం చేనేత, జౌళి శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో వరంగల్ తూర్పులోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పెద్ద ఎత్తున కలెక్టరేట్ నిర్మాణ స్థలంలో ఉత్సవాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### కానిస్టేబుల్ మౌనిక కేసులో పలువురికి రిమాండ్

రామన్నపేట: కానిస్టేబుల్ మౌనిక మృతిపై దర్యాప్తు చేసిన మట్టెవాడ పోలీసులు ఘటన బాధ్యులపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మహబూబాబాద్ డీఎస్పీ కార్యాలయం కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మౌనిక వరంగల్ నగరంలోని వేణురావు కాలనీలో నివాసం ఉంటోంది. భర్త శ్రీధర్ అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో ఈనెల 5న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. మౌనిక తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు లోతుగా దర్యాప్తు చేసిన మట్టెవాడ ఏసీపీ బోనాల కిషన్ అందుకు బాధ్యులను తేల్చారు. భర్త శ్రీధర్, ఆయన కుటుంబ సభ్యులైన అత్త వీరలక్ష్మి, బావ కృష్ణ మూర్తి, ఆడబిడ్డ విజయలక్ష్మి, ఆమె భర్త పోశాలు, గాయత్రి, అనిల్‌ను బాధ్యులుగా రిమాండ్ చేసి తరలించారు. కృష్ణమూర్తి ఎంజీఎంలో క్లర్క్‌గా, పోశాలు ల్యాబ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

### చదువుకొమ్మన్నందుకు బాలిక ఆత్మహత్య


జుర్రు రేవతి (ఫైల్)

కొత్తగూడ: మండలంలోని ఓటాయిలో చదువుకొమ్మని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన బాలిక ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రజిత–రాజా దంపతుల కుమార్తె జుర్రు రేవతి (14) అదే గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈనెల 1న పాఠశాలకు వెళ్లి వచ్చి పిల్లలతో ఆడుకుంటుండగా.. చదువుకొమ్మని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలిక అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలానికి కొట్టే కలుపు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం బాలిక మృతి చెందింది. చదువుకొమ్మంటే ఇలా చేస్తుందనుకోలేదంటూ బాలిక తల్లిదండ్రుల విలపించిన తీరు పలువురిని కంటతడి పెంటించింది.

### భక్తిశ్రద్ధలతో అర్చనలు

- నేటితో బ్రహ్మోత్సవాల ముగింపు


పూజలు చేస్తున్న భక్తులు

హసన్‌పర్తి: శ్రీఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం క్షీరాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, ఈట కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు. శనివారంతో ఉత్సవాలు ముగుస్తాయి.






# కల్పవల్లి ఫాతిమా మాత

- 70వ మహోత్సవాలకు ముస్తాబు
- నవదిన ప్రార్థనలు ప్రారంభం
- నేటి నుంచి ఉత్సవాలు షురూ
- వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



కాజీపేట రూరల్: వరంగల్ మహా నగరంలో కాజీపేట ఫాతిమా మాత దేవాలయం (కేథడ్రల్) భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ఫాతిమానగర్‌లోని కేథడ్రల్ చర్చి ప్రాంగణంలో శని, ఆది, సోమవారాల్లో ఫాతిమా మాత 70వ మహోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతీ ఏటా ఎంతో అంగరంగ వైభవంగా జరిగే ఫాతిమా ఉత్సవాలు ఈసారి కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కేథడ్రల్ చర్చి కమిటీ, ఫాదర్స్ సర్వం సిద్ధం చేస్తున్నారు.

**ఉత్సవాల విశేషాలు..**

9 రోజులు జరిగే ఫాతిమా ఫీస్ట్‌ను మార్చి 3న నవ దిన ప్రార్థనలతో ప్రారంభించారు. ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల ఆధ్వర్యంలో 11న వివాహ దంపతులకు సన్మానం, 12న ఫాతిమానగర్ పురవీధుల్లో ఫాతిమామాత స్వరూపంతో మహా రథ ప్రదక్షిణ, దివ్య బలిపూజ, 13న ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ పీఠాధిపతి ప్రిన్స్ అంథోనిచే సమష్టి కృతజ్ఞతబలి స్వస్థత ప్రార్థనలు, దివ్య ప్రసాద ఆరాధన, కొవ్వొత్తులతో దివ్య ప్రసాద ప్రదక్షిణ–దివ్యప్రసాద ఆశీర్వాదం ఉంటుంది. తుమ్మ యాగారెడ్డి దివ్యపూజ, పతాక అవరోహణతో ఫాతిమామాత ఉత్సవాలు ముగుస్తాయి.

**ఆలయ చరిత్ర ఇలా..**

వరంగల్ మేత్రసనం ఏర్పాటుకు ముందు 1949లో ఆనాటి హైదరాబాద్ వికార్ మోన్సీగ్నోర్ అల్ఫోన్స్ బెరెట్టా వరంగల్ మేత్రాసనం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తూ మేత్రాసనానికి కావాల్సిన కట్టడాలను నిర్మించేందుకు వరంగల్‌లోని స్థలాన్ని చూడాలని గురువులను ఆదేశించడం జరిగింది. అనేక వ్యయ ప్రయాసల అనంతరం ప్రస్తుతం ఉన్న ఫాతిమా స్థలం 71 ఎకరాలు కొనుగోలు చేశారు. మేత్రాసనం భవన నిర్మాణానికి ఆనాటి ప్రభుత్వం నుంచి అనుమతి నిరాకరించారు. ఈపరిణామాలతో బిషప్ బెరెట్టా సతమతమవుతున్న తరుణంలో పోర్చుగీసు దేశం నుంచి అద్భుల ఫాతిమామాత స్వరూం హైదరాబాద్‌కు 1950 మే 13,14 తేదీల్లో తీసుకరావడం జరిగింది. ఫాతిమామాత స్వరూం వద్ద అవరోధాలు అన్ని పోవాలని బిషప్ బెరెట్టా ప్రార్థించారు. ఫాతిమా తల్లి కృప, కనికరముల వల్ల అద్భుతంగా అటంకాలన్నీ తొలగి కావాల్సిన అనుమతులన్నీ లభించాయి. ఇలా 1951 జనవరి 14న పీఠాధిపతుల నిలయానికి శంకుస్థాపన చేశారు. బిషప్ బెరెట్టా అనుమతితో బ్రదర్ సాలా ఈ ప్రాంతానికి ఫాతిమానగర్ అని నామకరణం చేసి ఈ మేత్రాసనంను ఫాతిమా తల్లికి అంకితమిచ్చారు. భారతదేశంలో ఫాతిమామాత పేరు మీద వెలిసిన చర్చి కాజీపేటలో ఉండడం విశేషం.

**చారిత్రాత్మక రాతి కట్టడం**

1956లో అల్ఫోన్స్ బెరెట్టా బిషప్ ఫాతిమా మాత పేరు మీద కెథడ్రల్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి బ్రదర్ సాలాకు నిర్మాణ సారథ్యాన్ని అప్పగించారు. వారు ములుగు ప్రాంతం నుంచి ప్రత్యేక రాతిని తెప్పించి సుమారు 6 ఏళ్ల పాటు శ్రమించి అపూర్వ చారిత్రాత్మక రాతి కట్టడాన్ని నిర్మించారు. 1962 మార్చి 13న బిషప్ బెరెట్టా ఫాతిమా కెథడ్రల్ దేవాలయాన్ని ప్రతిష్టించి ఆశీర్వదించారు. అప్పటి నుంచి ఈ దేవాలయం మేత్రాసన స్థాయిలో అన్ని ఆధ్యాత్మిక పూజా తదితర ప్రార్థన పండుగలకు నిలయంగా కొనసాగుతుండగా.. క్రీస్తుని తల్లి ఫాతిమా మాత విన్నప ప్రార్థనల ద్వారా దేవుడు ఈ మేత్రాసనంపై ఎంతో మేలును, అనుగ్రహాలను కురిపిస్తున్నారు. ఫాతిమా తల్లి గౌరవార్థం మేత్రాసన స్థాయిలో ప్రతీ ఏటా మతాలకతీతంగా ఆ తల్లీదీవెనల కోసం ఫాతిమామాత ఉత్సవాలు జరుగుతున్నాయి.

**గుహ ముస్తాబు**

ఉత్సవాల సందర్భంగా ఫాతిమామాత గుహను ఎంతో సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ కాంతులను అలంకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఉత్సవాల ముగింపు వరకు భక్తులు ఇక్కడే ప్రార్థనలు చేసి తల్లిని తమ కోర్కెలు కోరుకుంటారు. కేథడ్రల్ చర్చిని విద్యుత్ కాంతులతో అత్యాధునీకీకరించారు.

### వేడుకల పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్లు జోసెఫ్, మర్రెడ్డి, ఇతర ఫాదర్లు

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ కేథడ్రల్ చర్చి ప్రాంగణంలో ఈనెల 11వ తేదీ నుంచి 13 వరకు 70వ ఫాతిమామాత మహోత్సవం పండుగలు జరుగనున్నట్లు ఓరుగల్లు పీఠం ఛాన్సలర్ ఫాదర్ కె.జోసెఫ్, విచారణ గురువు ఫాదర్ మర్రెడ్డి అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శుక్రవారం ఫాతిమా మాత పండుగుల పోస్టర్‌ను ఆవిష్కరించి ఫాదర్లు జోసెఫ్, మర్రెడ్డి మాట్లాడుతూ.. ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి ఉడుముల బాల ఆధ్వర్యంలో ఫాతిమా మహోత్సవంలో భాగంగా ఈనెల 3 నుంచి 11 వరకు నవ దిన జపములు ఉంటాయని, 12 జిల్లాల విశ్వాసుల తిరునాళ్ల మహోత్సవంలో ప్రధాన ఘట్టాలు శనివారం 25, 50 ఏళ్ల వయస్సు గల దంపతులకు సన్మానం, ఆదివారం ఫాతిమానగర్ పురవీధుల్లో ఫాతిమా మాత స్వరూపంతో మహా రథ ప్రదక్షిణ, సోమవారం మహాబలిపూజ పండుగల ముగింపు ఉంటుందని తెలిపారు. ఫాతిమా మాత పండుగల్లో ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ పీఠాధిపతి ప్రిన్స్ అంథోని పాల్గొంటున్నట్లు తెలిపారు. కుల, మత బేధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఈ ఫాతిమామాత ఉత్సవంలో పాల్గొని మాత దీవెనలు ఆశీర్వాదాలు పొందుతారని వారు తెలిపారు. సెక్రటరి ఫాదర్ జి.అనుకిరణ్ మాట్లాడుతూ.. ఫాతిమా మాత దీవెనలతో ఫాతిమామాత పండుగల సమయంలో ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న వరంగల్ హంటర్ రోడ్ బ్రిడ్జి సమీపంలో గల ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఏర్పాటుకు అనుమతి లభించిందని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఫాదర్ కృపరావు, ఆర్.రాజ్‌మోహన్‌రావు, జి.సుధీర్, శౌరిల, టిక్కు పాల్గొన్నారు.

### ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఫాతిమా మాత ఉత్సవాలకు సంబంధించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేయడం జరిగింది. షామియానలు, మంచినీరు, కుర్చీల ఏర్పాటు. కేథడ్రల్ చర్చిలో, ఫాతిమామాత గుహ వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేయడం జరిగింది. 12 జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం ఫాతిమానగర్ క్యాంపస్‌లో పలు చోట్ల వసతి ఏర్పాటు చేశారు.

– ఉడుముల బాల, ఓరుగల్లు పీఠాధిపతి

# దొంగ నోట్ల ముద్రణ కేసులో దంపతులకు జైలు

వరంగల్ లీగల్ : నకిలీ నోట్లు ముద్రిస్తున్న నగరంలోని కాశిబుగ్గ తిలక్‌నగర్‌కు చెందిన వంగరి రమేశ్, సరస్వతి దంపతులకు 5 ఏళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. నాటి ఇంతేజార్‌గంజ్ ఎస్సై స్వామికి 2021 జూన్ 6న కాశిబుగ్గలోని ఓఇంట్లో నకిలీ నోట్లు ముద్రిస్తున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి ఆఇంటిపై దాడి చేయగా.. పోలీసుల రాకను గమనించిన ఇరువురు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు పట్టుకోగా.. ఇరువురు దంపతులుగా నిర్ధారణ అయింది. వంగరి రమేశ్ స్థానికంగా చికెన్ సెంటర్, అతడి భార్య సరస్వతి కంగన్‌హాల్ నడిపిస్తారని, దీని చాటు మార్గాన దొంగనోట్లు ముద్రిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా విచారణలో నేరం రుజువుకావడంతో జడ్జి వెంకటేశ్వరరావు 5 ఏళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈకేసును ఇన్‌స్పెక్టర్లు డి.మల్లేశ్, జి.వెంకటేశ్వర్లు దర్యాప్తు చేయగా, లైజన్ ఆఫీసర్ కె.వెంకటస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ అనిల్‌కుమార్, హోంగార్డు జె.శేఖర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌కె అబ్దుల్‌నబీ కేసు వాదించారు.

# 14 నుంచి పీజీ ఫస్ట్ సెమ్

- సైన్స్‌లో సిలబస్ పూర్తికాక పరీక్ష తేదీల్లో మార్పులు
- టైంటేబుల్ విడుదల చేసిన అధికారులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్, ఎంఏ హిందీ, ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతి, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, ఎకనామిక్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎంకామ్ జనరల్ ఎఫ్ఏ, సీఏ, బీఅండ్ఐ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్‌ఎం కోర్సుల మొదటి సంవత్సరం విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 14, 16, 18, 20, 23, 25 తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి శుక్రవారం తెలిపారు. సైన్స్ కోర్సుల్లో ఎమ్మెస్సీ బాటనీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జియాలజీ, మ్యాథమేటిక్స్, అప్లైడ్ మ్యాథ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, సైకాలజీ, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ అండ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుల ఎంఎల్ఐఎస్సీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 18 నుంచి నిర్వహించనున్నారు. ఈనెల 18, 20, 23, 25, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

**సిలబస్ పూర్తవకున్నా..**

యూనివర్సిటీలో మొదటి సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్ ఖరారు చేసే ముందు కొద్ది రోజుల క్రితం అన్ని విభాగాల అధిపతులతో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్ సమావేశం నిర్వహించారు. అప్పుడు సైన్స్ విభాగాలకు చెందిన పలువురు విభాగాధిపతులు ఇంకా సిలబస్ పూర్తి కాలేదని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికీ ఇదేమీ పట్టించుకోకుండా ఈనెల 14 నుంచి అన్ని పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించవచ్చునని టైంటేబుల్‌ను విడుదల చేసుకోవచ్చునని పరీక్షల విభాగానికి సమాచారం అందించారు. దీంతో పరీక్షల విభాగం అధికారులు ఇటీవలే పీజీ కోర్సుల్లోని అన్ని విభాగాలకు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14 నుంచి టైంటేబుల్‌ను విడుదల చేశారు. సిలబస్ పూర్తవకున్నా టైంటేబుల్ ఖరారు చేయటమేమిటనే విమర్శలు వచ్చాయి.

**విడివిడిగా టైంటేబుల్**

పలువురు సైన్స్ విభాగాధిపతులు సిలబస్ పూర్తవలేదని అందువల్ల ఈనెల 14 నుంచి పరీక్షలు నిర్వహించవద్దనిచ మార్పు చేయాలని పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో శుక్రవారం పరీక్షల విభాగం అధికారులు ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్, కామర్స్ విభాగాలకు ఈనెల 14 నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లుగా సైన్స్ కోర్సులకు మాత్రం ఈనెల 18 నుంచి నిర్వహిస్తూ టైంటేబుల్‌ను విడివిడిగా విడుదల చేశారు. యూనివర్సిటీ చరిత్రలో పీజీ కోర్సుల్లో ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ విద్యార్థులకు, సైన్స్ విద్యార్థులకు వేర్వేరుగా టైంటేబుల్‌ను పరీక్షల విభాగాధికారులు విడుదల చేయడం మొదటిసారి.

# రుద్రేశ్వరుడికి అభిషేక పూజలు



శ్రీనివాసరావు దంపతులకు మహాదాశీర్వచనం అందజేస్తున్న ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ వేయిస్తంభాల ఆలయాన్ని శుక్రవారం ప్రముఖ వ్యాపారవేత్త, జీఎంఆర్ గ్రూపు డైరెక్టర్ శ్రీనివాసరావు దంపతులతో కలిసి ప్రభుత్వ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయమర్యాదలతో స్వాగతించారు. శ్రీనివాసరావు దంపతులు శ్రీరుద్రేశ్వరస్వామికి అభిషేకం చేశారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు ఇచ్చారు. స్వామివారి శేషవస్త్రాలు కప్పి మహాదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జున్‌రావు శివభక్తుడని, రుద్రేశ్వరస్వామివారికి వెండి ఆభరణాలు (11నాగులతో నాగఫడి) వెండి తొడుగులు తమిళనాడులో చేయిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల్లో ఆలయానికి అందజేస్తామన్నారు. ఈ నెల 21నుంచి జరిగే శ్రీరామనవమి కల్యాణోత్సవాలకు 1.09లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ సభ్యులు దర్శన్‌సింగ్, మాజీ కార్పొరేటర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటకు 'మొగి' ముప్పు

- ఎండిపోతున్న పిలకలు
- యాసంగిలో పురుగు ప్రభావం ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు


ఎండిపోతున్న పొలం


కాండం తొలుచు పురుగు ఆశించిన మొక్కను చూపుతున్న రైతు

కరీమాబాద్: వరి పంటకు మొగిపురుగు (కాండం తొలుచు పురుగు) ముప్పు ముంచుకొస్తోంది. ఇప్పుడిప్పుడే పిలకలు వేస్తున్న వరినార్లు పురుగు మూలంగా ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న వరి పంట చూస్తుండగానే ఎండిపోతుండడం రైతులను కలవరపెడుతోంది. గత రెండు,మూడు సంవత్సరాల కంటే ఇప్పుడు పురుగు పిలక దశలోనే ఎక్కువ ఆశిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాండం తొలుచు పురుగును ప్రారంభ దశలోనే నియంత్రించకపోతే నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

**పురుగుకు నాలుగు జీవిత దశలు..**

కాండం తొలుచు పురుగుకు నాలుగు దశలుంటాయి. వాటిలో గుడ్డు దశ, లార్వా దశ, కోశస్త దశ, రెక్కల పురుగుగా రూపాంతరం. రెక్కల పురుగుగా ఉన్నప్పుడు వరినారు చివరి భాగంలో 20 నుంచి 70 గుడ్లు పెడతాయి. ఈ గుడ్లు పొదిగి 3 రోజుల్లో లార్వాలు బయటకు వచ్చి మొక్క కాండంలోకి పోతాయి. అవి కాండం లోపలి కణజాలాన్ని తింటూ పంటకు నష్టం చేస్తాయి.




**నష్ట పరిచే విధానం.. పురుగు ఉనికిని గుర్తించడం..**

కాండం తొలుచు పురుగు పిలక దశనుంచి చిరు పొట్టదశ వరకు పైరును ఆశిస్తూ నష్టపరుస్తుంది. పిలక దశలో ఆశిస్తే మొవ్వలు గోధుమ రంగులోకి మారి ఎండిపోతాయి. చిరు పొట్టదశలో ఆశిస్తే ఈనిన తర్వాత తెల్ల కంకులు బయటకు వస్తాయి. ఎకరానికి 3 లింగాకర్షణ బుట్టలు అమరిస్తే పురుగు ఉనికిని గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**నారుమడి నుంచే జాగ్రత్తలు తీసుకుంటే..**

నారుమడి దశనుంచే సస్యరక్షణ చర్యలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే కాండం తొలుచు పురుగు విస్తరణను తగ్గించవచ్చు. నాటు వేసే వారం రోజుల ముందు మడిలో 'కార్బోఫ్యూరాన్–3జి' గుళికలు నీరు పలుచగా ఉండేలా చూడాలి.

**పొలంలో పాటించాల్సిన సర్యరక్షణ చర్యలు**

- కాండం తొలుచు పురుగు ఉధృతి పెరగకుండా ఉండేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి.
- ఎకరంలో 8 నుంచి 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిలోని 'లూర్'ని 3 వారాలకు ఒక్కసారి మార్చాలి.
- పంట తొలిదశలో గుడ్ల నివారణకు వేప నూనె పిచికారీ చేయాలి.
- ట్రై కోగ్రాం జపానికం, ట్రై కోగ్రాం కిలోనస్ అమర్చాలి.
- నాటు వేసిన 15 నుంచి 25 రోజులలో కార్బోఫ్యూరాన్ గుళికలు ఎకరాకు 10 కిలోలు వేయాలి.
- చివరి పొట్టదశలో క్లోరంట్రనిలిప్రోల్, ట్రనిలిప్రోల్, కార్ట్సహైడ్రోక్లోరైడ్ మందును మోతాదును బట్టి పిచికారీ చేయాలి.

**రైతులు పిలకలను పరిశీలించాలి**



రైతులు నారుమడి నుంచి నాటు వేసే వరకు మొక్క పిలకలను పరిశీలిస్తుండాలి. నాటు వేసిన తర్వాత మరింత అప్రమత్తంగా ఉండాలి. కాండం తొలుచు పురుగును తొలి దశలోనే నివారించాలి. పిలకలు ఎండిపోతుండడం ప్రారంభం కాగానే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పురుగు దశలను బట్టి మందులు, గుళికలు వాడాలి. తెల్ల కంకి వచ్చిన తర్వాత ఈ పురుగు నివారణకు ఏ మందులు కూడా పనిచేయవు. కాబట్టి రైతులు జాగ్రత్తగా పంట పొలంను గమనించాలి.

– డాక్టర్ అగుర్ల రాజు, శాస్త్రవేత్త, కేవీకే, మామునూరు


## సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**

**PLOT & HOUSE కావలెను**

■5 లక్షల విలువ కలిగిన House Number ఉన్న Plot లేదా పాత House కావలెను. సంప్ర॥ 6309013618. [W-775789]

**PLOT FOR SALE**

■వరంగల్ పట్టణంలో నర్సంపేట రోడ్డు వైపున ఉన్న హనుమాన్ వే బ్రిడ్జి ప్రక్కన L.R.S కట్టిన Open Plot 210 Sq. Yds. అమ్మబడును. సంప్ర॥ 8790447762. [M-8975]

■లాంచింగ్ ఆఫర్ (12/03/2023) రూ. 5499/-చ.గ. @ ఆలేరు 50 ఎకరాల DTCP లేఔట్, క్లబ్ హౌస్, స్విమ్మింగ్‌పూల్, EMI కలదు. సైట్ విజిట్ కాల్ : 7730884948 [HA-92568]

**PROPERTY FOR SALE**

■Urgent Sale of Residential House 374 Sq.Yards G plus 1 in SBH Colony, Hanamkonda near to NIT Collector Office. For Buying / Sale of Ur Property Contact us 7989106048. No Fees [HA-10205]

**WANTED**

■ప్రముఖ కృష్ణవేణి రె॥ జూ॥ కాలేజ్, హన్మకొండలో మేల్‌వార్డెన్స్, ఫిమేల్ (లేడీ) వార్డెన్స్, ఆటో ట్రాలీ డ్రైవర్, అసిస్టెంట్ వంట మాస్టర్, ఆయాలు అర్జెంటుగా కావలెను. సెల్: 9949610729. [WA-6913]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

■GNM Nurses, Pharmacists Computer Operators & Supervisors required for Guardian Hospital, Mulugu X Road, WGL, Cont: 12 to 2pm [WA-0210]

■Any Qualification Fluency in English & Hindi. Office Asst & Primary Lady Teachers, P.E.T. Cont: Pavani School, Edga, HNK. Cell: 9393350567 [WA-6906]

■Wanted Marketing Executives Male (OR) Female for CSR Developers. For more Details Cont: 7997777377. [W-775846]

■ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకు ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్ర: 90300 07628 [L-537]

■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520. [M-1190584]

■అతితక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730899503 [G-514]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్ టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు సంప్ర: 9059509586. [G-781947]

■హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ:18K, ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9640258899, 9640468899 [H-786847]

**FACULTY TEACHERS**

■Lady Maths Lecturers Needed in Hyderabad. Salary: Rs. 40,000/-. Qual : M.Sc Maths / B.Sc Maths. ఆసక్తిగలవారు 'Math' అని 85230 58441 కు WhatsApp చేయగలరు. దయచేసి కాల్ చేయవద్దు. [B-985]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/-రూ॥లు మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


### నమాజ్ చేస్తూ కుప్పకూలిన వృద్ధుడు

- గుండెపోటుతో మృతి


మసీదులో గుండెపోటుతో కుప్పకూలిన రహమాన్

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని మహమ్మదీయ మసీద్‌లో ముస్లింలకు పవిత్ర దినమైన శుక్రవారం మధ్యాహ్నం నమాజ్ చేస్తూ గుండెపోటుతో కుప్పకూలి ఓ వృద్ధుడు మృతి చెందాడు. వరంగల్ శంభునిపేటకు చెందిన మహమ్మద్ రహమాన్(60) నిత్యం స్థానిక మహమ్మదీయ మసీద్‌కు వెళ్లి నమాజ్ చేస్తూ ఉంటాడు. రోజూవారీగానే శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి మసీద్‌కు చేరుకుని నమాజ్ చేస్తూ కుప్పకూలాడు. అక్కడే ఉన్న సమాజిక కార్యకర్త గుండెవద్ద మర్దన చేసినా ఫలితంలేదు. హుటాహుటిన అతడిని ఎంజీఎం తరలించారు. అప్పటికి తుది శ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని తిరిగి ఇంటికి చేర్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ముస్లిం మతపెద్దలతో కలిసి స్థానిక కార్పొరేటర్ పోశాల పద్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

**బస్ స్టేషన్ ఆవరణలో వ్యాపారి..**


వరంగల్ బస్‌స్టేషన్‌లో నారాయణకు సీపీఆర్ చేస్తున్న మెడికో

వరంగల్ చౌరస్తా: వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం రాయపర్తి మండలం రాగన్నగూడేనికి చెందిన దొడ్డ నారాయణ(70) గుండె పోటుతో మృతి చెందాడు. కిరాణా వ్యాపారి అయిన నారాయణ అస్తమాతో ఇబ్బంది పడుతూ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం ఆర్టీసీ బస్సులో వరంగల్ బస్‌స్టేషన్‌కు వచ్చాడు. ఆ సమయంలో అతడికి ఛాతినొప్పి రావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. ఆదిలాబాద్‌కు వెళ్తున్న ఓ మెడికో ఆయనను సీపీఆర్‌తో రక్షించేందుకు ప్రయత్నించారు. అంతేకాకుండా విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ రామారావు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ నారాయణ మృతి చెందారు.

### కొమ్మాల జాతరకు వెళ్లొస్తూ వ్యక్తి మృతి


ఘటనాస్థలంలో రాందాస్ మృతదేహం

దుగ్గొండి: కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి జాతరకు వెళ్లొస్తుండగా ములుగు జిల్లా పత్తిపల్లి గ్రామానికి చెందిన తేజావత్ రాందాస్(40) గురువారం మృతి చెందాడు. రాందాస్ పత్తిపల్లి నుంచి కొమ్మాల జాతరకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దుగ్గొండి మండలం మైసంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. రోడ్డు పక్కన తీసిన కందకంలో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయాన్నే పొలం పనులకు వెళ్తున్న రైతులు రాందాస్ విగతజీవిగా ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నవీన్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ద్విచక్ర వాహనంలో కొబ్బరిముక్కలు, జాతరలో కొనుగోలు చేసిన ఇతర సామగ్రి ఉన్నాయి. సెల్‌ఫోన్‌లో నంబర్ల ఆధారంగా మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య సరిత, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

### యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధి కరీమాబాద్‌కు చెందిన యువతి అనురాధ అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ శుక్రవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన అనురాధ ఈనెల 7న స్నేహితులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకుంటామని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కేసముద్రం మండలం అర్పనపెల్లి గ్రామానికి చెందిన రాహుల్‌పై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో శుక్రవారం సాయంత్రం యువతి తండ్రి మదూరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకొచ్చిన కారు


డివైడర్‌పైకి దూసుకువచ్చిన కారు

కాజీపేట అర్బన్: అదుపు తప్పి డివైడర్‌పైకి కారు దూసుకొచ్చిన ఘటన హనుమకొండ హంటర్ రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. హనుమకొండ నుంచి వరంగల్ వైపు ప్రయాణిస్తున్న కారు శుక్రవారం రాత్రి హంటర్‌రోడ్డులోని రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రాంతానికి చేరుకోగా.. అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. కాగా.. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. దీంతో పెను ప్రమాదం తప్పింది.